

23 రోజులు..1000 రిజిస్ట్రేషన్లు

కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులకు వివాహ ధ్రువపత్రాలు అందజేసేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పోటెత్తుతున్నారు. - 10లో



క్వారీపై కన్ను

ఐరాల మండలం దేవుని నల్లగుట్టలోని క్వారీని కొల్లగొట్టేందుకు కూటమి నేతలు రంగంలోకి దిగారు. - 10లో



అంజన్న అభయం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం వనంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. - 10లో

న్యూస్‌రీల్

ఐఐటీ, నీట్ శిక్షణకు స్క్రీనింగ్ పరీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : డా.బీఆర్. అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం ఐఐటీ, నీట్ శిక్షణ సెంటర్‌ల ప్రవేశానికి స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జిల్లా కో ఆర్డినేటర్ గీత తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న బాల, బాలికలు ఈనెల 25వ తేదీన నిర్వహించే రెండవ స్క్రీనింగ్ పరీక్షకు హాజరు కావాలన్నారు. పరీక్ష ఉదయం 11 గంటలకు చిత్తూరు జిల్లా కేంద్రంలోని సంజయ్‌గాంధీ నగర్‌లో ఉన్న ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాలలో నిర్వహిస్తారన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకుని, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకుని రావాలని ఆమె వెల్లడించారు.

సిజేరియన్లను తగ్గించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సుధారాణి

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలో సిజేరియన్లను తగ్గించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆమె శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. మాతాశిశు మరణాల కట్టడికి అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో గర్భిణులకు సకాల ఆరోగ్య సేవలు అందేలా చూడాలన్నారు. హైరిస్క్ కేసులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రసవ సమయంలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని చెప్పారు. ప్రధానంగా సుఖ ప్రసవాల సంఖ్యను పెంచడంతో పాటు సిజేరియన్ల సంఖ్య తగ్గించాలని సూచించారు. సమావేశంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్, డీఐఓ హనుమంతరావు, వైద్యులు అనిల్‌కుమార్, ప్రవీణ, అనుష, రామ్మోహన్, ప్రసాద్, శ్రీవాణి పాల్గొన్నారు.

ఎస్సీ నిరుద్యోగ యువతకు శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చెన్నయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ నిరుద్యోగ యువతకు లెదర్ స్టిచ్చింగ్ ఆపరేటర్, లెదర్ పుట్‌వేర్, లెదర్ కట్టర్ పుట్‌వేర్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామన్నారు. శిక్షణకు ఎస్సీ కులస్థులై ఉండాలన్నారు. కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత చెంది ఉండాలన్నారు. శిక్షణలో ఉచిత భోజనం, వసతి, ఉచిత కిట్లు అందజేస్తామన్నారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు 98493 73131, 63056 88868 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ కష్టాలు



- ఇతని పేరు కృష్ణయ్య పాలసముద్రానికి చెందిన రైతు.. పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ట్రాన్స్‌కో అధికారులు బాగు చేస్తారని రెండు వారాలుగా నిరీక్షించారు. ఫలితం లేకపోవడంతో చిత్తూరుకు స్నేహితుడి ట్రాక్టర్ తీసుకొని రూ.1500 డీజిల్ పట్టుకొని, డ్రైవర్‌కు రూ.800 కూలీ ఇచ్చి తీసుకొచ్చాడు. మధ్యాహ్నం హోటల్‌లో భోజనం చేసి సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతులు చేయించుకొని తీసుకెళ్లారు. ఆయన పొలం నుంచి రానుపోనూ 84 కిలోమీటర్లు ప్రయాణించి అగచాట్లు పడ్డాడు.

వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే అన్నదాతల అగచాట్లు అన్నీఇన్నీ కావు. పొలం నుంచి సొంత డబ్బు వెచ్చించి ట్రాన్స్‌ఫార్మర్‌ను సమీప మరమ్మతుల కేంద్రానికి తీసుకెళ్లడం గగనమవుతోంది. అంత కష్టపడి అక్కడికి తీసుకెళ్లినా బేరం కుదిరితే గానీ రిపేరు చేసి ఇవ్వడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుకుబడి ఉన్న వారికే రోలింగ్‌స్టాకు అందిస్తున్నారు. సాధారణ రైతులకు అయితే రోలింగ్ స్టాకు లేదని ఖరాఖండిగా చెప్పేస్తున్నారని రైతులు వాపోతున్నారు. మరమ్మతుల కేంద్రంలో రైతులు క్షేత్రస్థాయిలో పడుతున్న ఇబ్బందులపై ఉన్నతాధికారుల చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- ఉమ్మడి జిల్లాలో నెలకు 1000 నియంత్రికలు రిపేరు
- పెరిగిన రోజువారీ విద్యుత్ వినియోగం
- సకాలంలో పూర్తి కాని పనులు
- అలసత్వం వహిస్తున్న విద్యుత్ అధికారులు

చిత్తూరు కార్పొరేషన్ : ఎండలు మండుతున్నాయి.. పగలు, రాత్రి తేడా లేకుండా ఇంట్లో ఫ్యాన్ స్పీడ్ 5 మీద ఉన్నా గాలి చాలడం లేదు. ఇక ఏసీ వాడకం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. సగటున జిల్లాలో 40–44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం బయటకెళ్లి పనులు చూసుకొని సాయంత్రం ఇంటికి వచ్చేలోపు చెమటలతో దుస్తులు తడిసిపోతున్నాయి. ఎండల మంటతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. దీంతో రైతన్నలు వాటిని బాగు చేసుకోవడానికి అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను రైతులు బాగు చేసుకోవాలంటే కష్టాలు పడుతున్నారు. సగటున నెలకు దాదాపు 1000 తక్కువ కాకుండా రిపేర్లకు గురవుతున్నాయి. ఎక్కువగా వేసవిలో ఈ కష్టాలు మరింత ఎక్కువ అవుతున్నాయి. చిత్తూరు, పుంగనూరు, పుత్తూరు, మదనపల్లె, శ్రీకాళహస్తిలో సమస్య అధికంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌లు మరమ్మతులకు రైతులను వేధిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారనే విమర్శలున్నాయి.



పాడైన ట్రాన్స్‌ఫార్మర్లు

అలంకారప్రాయంగా ఓఆర్‌ఎం

ఎండా కాలంలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల్లో అధికంగా ఆయిల్ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. పాత ఆయిల్‌ను శుద్ధిచేసి బాగుచేసి పంపుతున్నారు. చిత్తూరు కేంద్రంలో ప్రస్తుతం 200 లీటర్లను మాత్రమే శుద్ధి చేసే మిషన్ ఉంది. 2 వేల లీటర్ల ఆయిల్‌ను శుద్ధిచేసే నూతన ఓఆర్‌ఎం (ఆయిల్ రీజనరేషన్ మిషన్) ఇన్‌స్టాల్ చేయకుండా ఆరు నెలలుగా అలంకారప్రాయంగా అలానే ఉంచేశారు. అధికారుల అలసత్వంతో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నచందంగా తయారైంది. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో వీటి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గత ప్రభుత్వ పాలనలో రూ.50 లక్షల వ్యయంతో ఓఆర్‌ఎంను మంజూరు చేశారు. డిస్కం (రాయలసీమ, నెల్లూరు జిల్లాలు) పరిధిలో ఇటువంటి మిషన్ ఎక్కడా లేదు. పెండింగ్‌లో ఉన్న 10 శాతం మొత్తం ఇస్తేగానీ టెక్నీషియన్లు ఇన్‌స్టాలేషన్ చేయమంటున్నారు. ఆరు నెలలుగా మిషన్‌ను ఎస్‌పీఎంలో దిష్టిబొమ్మలాగా దర్శనం ఇస్తోంది. దీంతో అన్నదాతలకు ఇక్కట్లు తప్పడం లేదు.



చిత్తూరుకు ట్రాక్టర్‌లో తీసుకొచ్చిన మరమ్మతుకు గురైన ట్రాన్స్‌ఫార్మర్

అదనంగా మరమ్మతులు

ఏడాదిలో ఎక్కువగా ఫిబ్రవరి నుంచి జూన్ లోపు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల సంఖ్య పెరుగుతోంది. ఆ తర్వాత నెలల కంటే 30–50 శాతం అధికంగా రిపేర్లు వస్తున్నాయి. గతేడాది ఫిబ్రవరి నుంచి మే నెల వరకు 4,734 ట్రాన్స్‌ఫార్మర్‌లు మరమ్మతు అయితే ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి మే 17 వరకు 5,310 ట్రాన్స్‌ఫార్మర్‌లు రిపేర్ అయ్యాయి.

జెడ్పీటీసీల ఆవేదన పట్టదా?

ఉమ్మడి జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లు సకాలంలో మరమ్మతు చేయడం లేదని ఏప్రిల్ 29న జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో పలువురు జెడ్పీటీసీ సభ్యులు నిలదీశారు. సమస్య పరిష్కరిస్తామని తిరుపతి జిల్లా ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలియజేశారు. మే 13న జరిగిన జెడ్పీ స్థాయి సంఘాల సమావేశాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు సకాలంలో మరమ్మతు చేయడం లేదని, అధికారులు వేధిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

నిబంధనలకు పాతర

ఉమ్మడి జిల్లాలో రేణిగుంట, పుత్తూరు, పీలేరు, మదనపల్లె, శ్రీకాళహస్తి, చిత్తూరు , పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో ఎస్‌పీఎం(ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం) ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 2 రోజులు, నగర, పట్టణాల్లో రోజులో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేసి పంపాలనే నిబంధన ఉంది. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ లోడింగ్, అన్‌లోడింగ్, రిపేర్‌కు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ అది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. వ్యవసాయ సర్వీసుకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు అయితే రైతులు ట్రాక్టర్, టాటా ఏస్ వాహనాల నందు తెచ్చుకొని మరమ్మతులు చేయించుకుంటున్నారు. లోడింగ్, అన్‌లోడింగ్, మరమ్మతు, బిగింపులకు బేరాలు చేసుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా విద్యుత్ సమాచారం

గతేడాది, ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి మే నెల వరకు ఎస్‌పీఎంల (ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం) నందు రిపేరు చేసిన వివరాలు

నెల	2024	2025
ఫిబ్రవరి	1,152	1,224
మార్చి	1,194	1,806
ఏప్రిల్	1,146	1,548
మే (17వరకు)	1,242	732
మొత్తం	4,734	5,310

ఉమ్మడి జిల్లాలో వారం రోజులుగా రోజువారీ విద్యుత్ వినియోగం వివరాలు

తేది	వాడకం (మిలియన్ యూనిట్లు)
మే 10	21.20
11	21.54
12	23.13
13	25.16
14	24.95
15	23.17
16	22.63
17	21.80

ఇబ్బందులు పడుతున్నాం



ఎండకాలంలో ఎక్కువగా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు అవుతున్నాయి. కరెంటోళ్లకు విషయం చెబితే పెద్దగా పట్టించుకోవడం లేదు. బతిమలాడి పనులు చేసుకోవాలి. మాటలు చెబుతున్నట్లుగా క్షేత్రస్థాయిలో పనులు కావడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ రిపేరుకు వస్తే వాటిని బాగు చేసి తీసుకురావడానికి రైతులు నానా తిప్పలు పడుతున్నారు .
– గంగిరెడ్డి, రైతు చంద్రగిరి

రోలింగ్ స్టాక్ లేదంటున్నారు



ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు అయ్యే వరకు స్థానికంగా విద్యుత్‌శాఖ కార్యాలయాల్లో రోలింగ్ స్టాక్ అందుబాటులో ఉంచాలి. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. పాడైన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేసి మార్చే వరకు రోలింగ్ స్టాక్‌లోని ట్రాన్స్‌ఫార్మర్‌ను రైతు వాడుకుంటారు. కానీ రోలింగ్ స్టాక్ లేదని అధికారులు అంటున్నారు. పలుకుబడి ఉన్నవారి పనులు త్వరగా చేస్తున్నారు.
– తిరుమలరెడ్డి, రైతు నగరి

1912కు ఫిర్యాదు చేయండి

వేసవిలో ట్రాన్స్‌ఫార్మర్లు రిపేర్లు ఎక్కువ గా వస్తుంటాయి. సకాలంలో వాటిని బాగు చేసి పంపాలని రైతులను ఇబ్బంది పెట్టరా దని సంబంధిత అధికారులను ఆదేశించాం. సమస్యల పై 1912కు ఫిర్యాదు చేయండి. రవాణా, మరమ్మతు, ఇతర సేవలకు ఎటువంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ల రోలింగ్ స్టాక్‌ను అందుబాటులో ఉంచుతాం. – సురేంద్రనాయుడు, ఇస్మాయిల్ అహ్మద్, ట్రాన్స్‌కో ఎస్‌ఈలు, తిరుపతి, చిత్తూరు జిల్లాలు

సీఎం పర్యటన ఏర్పాట్లలో కలెక్టర్, ఎస్పీ



ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ

శాంతిపురం : కడపల్లి పంచాయతీలోని శివపురం వద్ద నిర్మించిన సొంతింటి గృహ ప్రవేశానికి సీఎం చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు ఏర్పాట్లను పరిశీలించారు. ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకూ సీఎం కుప్పం పర్యటన సాగనుంది. దీంతో నూతనంగా నిర్మించిన ఇంటిని, ద్రవిడ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను సందర్శించారు. వి.కోట నుంచి కుప్పం వరకూ జాతీయ రహదారిలో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. రోడ్డు పక్కన ఉన్న చెట్లను తొలగించి, పారిశుధ్య పనులు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కొత్త ఇంటి వద్ద పార్కింగ్, శ్యానిటేషన్, బారికేడ్లు తదితర అంశాలపై మార్గదర్శకం చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ నందకిషోర్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసరాజు, డీపీఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హాకింగ్ పాఠశాల యథావిధిగా కొనసాగుతుంది

- రాజకీయ కక్షతోనే స్టేట్ సిలబస్ అనుమతులు రద్దు
- సీబీఎస్‌ఈ అనుమతులు ఉన్నాయి
- హాకింగ్ ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ హఫీజ్



మాట్లాడుతున్న హఫీజ్

కుప్పంరూరల్/శాంతిపురం: రాజకీయ కక్షతోనే ప్రభుత్వం తమ పాఠశాల అనుమతులు రద్దు చేసిందని కుప్పం హాకింగ్ ఇంటర్‌నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ హఫీజ్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున చైర్మన్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలవడమే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస సమాచారం ఇవ్వకుండా జిల్లా అధికారులు తమ పాఠశాలలో 8, 9, 10 తరగతులు రద్దు చేయడం దారుణమన్నారు. తరగతుల రద్దు విషయం సామాజిక మాధ్యమాల్లో తెలుసుకున్న తరువాత శుక్రవారం హఫీజ్ పాఠశాలలో విలేకరులతో మాట్లాడారు. 2019లో పాఠశాల ప్రారంభించామని, మొత్తం 950 మంది విద్యార్థులు చదువుతున్నారని, 150 మంది వరకు సిబ్బంది పనిచేస్తున్నారని వివరించారు. అధికారులు ఏకపక్షంగా 8, 9, 10 తరగతుల స్టేట్ సిలబస్ రద్దు చేయడం దారుణమన్నారు. తల్లిదండ్రులు ఎవరూ ఆందోళన చెందొద్దని, స్టేట్ సిలబస్ అనుమతులు మాత్రమే రద్దు చేశారని, సీబీఎస్‌ఈ అనుమతులు ఉన్నాయని, తరగతులు యథావిధిగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ వ్యవహారంలో అధికారుల తీరుపై కోర్టుకు వెళ్తామని హఫీజ్ తెలిపారు. అనుమతుల రద్దుకు అధికారులు చెప్పిన కారణాలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. విలేకరుల సమావేశంలో పాఠశాల డైరెక్టర్ షబ్బీర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

విపక్షాన్ని అణచివేసే కుట్రే

విపక్షాన్ని అణచివేసే కుట్రలో భాగంగానే హాకింగ్ స్కూల్ అనుమతులు రద్దు చేశారని వైఎస్సార్‌సీపీ కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ భరత్ విమర్శించారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామన్నారు. తాను, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోపాటు పార్టీ కూడా హఫీజ్‌కు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

కార్యకర్తలకు అండగా నిలబడుతాం



నారాయణ స్వామి, మాజీ డిప్యూటీ సీఎం

కార్వేటినగరం : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా నిలబడుతామని అధైర్య పడాల్సిన అవసరం లేదని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గంగమాంబాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత చిన్నబ్బరెడ్డి ఇంటి వద్ద కార్యకర్తలతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కార్యకర్తకు అండగా ఉండేందుకు సిద్ధంగా ఉన్నారని గుర్తు చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలు, నాయకులు అంకిత భావంతో కృషి చేసి సర్పంచ్‌లు, ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్ర రాజకీయాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. ఏడాది కాక ముందే కూటమి కోటలు బీటలు వారుతున్నాయని, శాసనసభ ఎన్నికల్లోపే టీడీపీకి జెండా పట్టే కార్యకర్తలు కరువవ్వడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పట్టాభిరెడ్డి, మురాజ్, రామిరెడ్డి, సతీష్, చందురాజు, అమీద్, ,శోభన్‌బాబు, ప్రేమనాథరెడ్డి, ధనంజయ వర్మ, శేషాద్రి, మునిరెడ్డి, మణి (వెదురుకుప్పం పార్టీ కన్వీనర్), కుప్పయ్య, జనార్దన్, భూపతిరెడ్డి, నందగోపాల్ పాల్గొన్నారు.

గురువుల గగ్గోలు

బదిలీల జాతరలో పూటకో కొత్త రూల్స్‌ను పెట్టి అయ్యోర్లను ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఇదేంది సారూ.. గతంలో ఎన్నడూ లేని కొత్త రూల్స్ ప్రవేశపెడుతున్నారేంటి అని ప్రశ్నించే టీచర్లను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఫలితంగా బదిలీలు, ఉద్యోగోన్నతులపై క్షేత్ర స్థాయిలో స్కూల్ అసిస్టెంట్‌లు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు.

- ఉద్యోగోన్నతులు, బదిలీల్లో కొత్త రూల్స్
- ప్రతిసారీ బలయ్యేది మాత్రం స్కూల్ అసిస్టెంట్‌లే
- పట్టించుకోని అధికారులు
- దిక్కుతోచని స్థితిలో ఎస్‌ఏలు



డీఈవో కార్యాలయం, చిత్తూరు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రస్తుతం చేపడుతున్న టీచర్ల బదిలీలు, ఉద్యోగోన్నతులకు కొత్త రూల్స్ ప్రవేశపెట్టి రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు. న్యాయం చేయాలని పలువురు స్కూల్ అసిస్టెంట్‌లు జిల్లా విద్యాశాఖ అధికారులను కోరుతున్నా ఫలితం దక్కడం లేదు. ఇప్పటికే బదిలీల పర్వం మొదలైంది. ప్రస్తుతం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం హెచ్‌ఎంల బదిలీలు నిర్వహిస్తున్నారు. మిగిలిన కేడర్ల టీచర్ల జీవో ప్రకారం బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అయితే పూటకో కొత్త రూల్స్ తీసుకొస్తుండడంపై జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్‌లు విస్తుపోతున్నారు.

సమస్యలివే..

- పట్టణ ప్రాంతాలు, మండల హెడ్ క్వార్టర్లు ,పంచాయతీ హెడ్ క్వార్టర్స్‌లో ఉండే పీఎస్ హెచ్‌ఎం పోస్టులు స్కూల్ అసిస్టెంట్‌లకు ఇవ్వకూడదని డిమాండ్ చేస్తున్నారు. మరి సుమారుగా ప్రతి సబ్జెక్టులోనూ వందలాది పోస్టులు మిగులుగా చూపిస్తుంటే ఎస్‌ఏలు ఎక్కడికి వెళ్లాలని ఏ ఒక్క సంఘమైనా ప్రశ్నిస్తోందా.
- స్కూల్ అసిస్టెంట్‌లకు రావలసిన ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, డైట్, హైస్కూల్ ప్లస్ (జూనియర్ కళాశాల) ఉద్యోగోన్నతులు అడిగే నాథుడు కరువయ్యారు.
- ఖాళీగా ఉన్న అన్ని ప్రధానోపాధ్యాయ పోస్టులు, మండల విద్యాశాఖ అధికారులుగా అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు ఇవ్వాలి.
- ప్లస్ వన్‌కు శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగోన్నతులతో అన్ని పోస్టులు కేటాయించి వాటిని బలోపేతం చేయాలి. కాని పక్షంలో గతంలో లాగే అన్ని సబ్జెక్టులకు స్కూల్ అసిస్టెంట్లను నియమించాలి.

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

ప్రాథమికోన్నత పాఠశాలలు:	446
ఉన్నత పాఠశాలలు:	709
హైస్కూల్ ప్లస్, జూనియర్ కళాశాలలు:	68
స్కూల్ అసిస్టెంట్‌లు:	15,256

- ఉమ్మడి సీనియారిటీ లెక్కించేటప్పుడు, ఉద్యోగోన్నతి పొందిన ఫీడర్ కేటగిరీని పరిగణలోకి తీసుకోవాలి.
- ఒకే నెల, డైరెక్ట్, ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్ జరిగిన, రోజుల వ్యవధిలో చేరిన, ఉద్యోగోన్నతి పొందిన సీనియర్లను (2002 అక్టోబర్) వెనుక పెట్టడంపై సీనియర్లకు అన్యాయం జరుగుతోంది.
- మొదట అన్ని కేటగిరీలలో పదోన్నతులిచ్చి, తర్వాత బదిలీలు జరపాలి. బదిలీలలో అన్ని పోస్టులు ఖాళీలుగా చూపించాలి.
- రేషనలైజేషన్ పొందుతున్న ఉపాధ్యాయుల్లో సీనియర్ అయినా జూనియర్ అయినా, విల్లింగ్ ఇచ్చిన వారికి ఐదు పాయింట్లు కేటాయించాలి.
- మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో కూడా ప్రధానోపాధ్యాయుల పోస్టులు స్కూల్ అసిస్టెంట్ లకు అవకాశం ఇవ్వాలి.

నిబంధనల పేరుతో ఇబ్బందులు

కూటమి ప్రభుత్వం టీచర్లపై కక్ష సాధింపు దిశగా కొత్త నిబంధనలను తీసుకొచ్చి ఇబ్బందులు సృష్టిస్తోందని టీచర్లు విమర్శిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు మాత్రం ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ సర్వీసును లెక్కించేందుకు అనుమతించారు. అయితే మొదట ఒక డీఎస్సీలో ఎస్జీటీగా ఉద్యోగం పొంది, తదనంతరం జరిగిన డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ గా ఎంపికైన వారు జిల్లాలో చాలా మంది ఉన్నారు. అటువంటి టీచర్ల ఎస్జీటీ ఎస్ఆర్ లో స్కూల్ అసిస్టెంట్‌గా సర్వీస్ కొనసాగిస్తున్న వారికి మాత్రం ఎస్జీటీ సర్వీసెస్ పాయింట్లను పరిగణలోకి తీసుకో వడం లేదు. ఇది ఎంత వరకు సమంజసమని బాధిత టీచర్లు ప్రశ్నిస్తున్నారు.

ఎస్‌ఏలపై చులకన భావం సరికాదు



స్కూల్ అసిస్టెంట్‌లపై చులకన భావన సరికాదు. స్కూల్ అసిస్టెంట్‌లకు బదిలీ, ఉద్యోగోన్నతుల్లో జరుగుతున్న అన్యాయాలను పరిష్కరించాలి. ఒక స్కూల్ అసిస్టెంట్ 2001 డీఎస్సీలో ఎస్జీటీ గా ఎంపికయ్యారు. మళ్లీ 2003 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ గా ఎంపికై ఎస్జీటీ నుంచి రిలీవ్ అయ్యి ఎస్ఏ గా చేరారు. మొదటి అపాయింట్‌మెంట్ 2002 గా సర్వీస్ రికార్డ్‌లో నమోదైంది. కాగా ప్రస్తుత బదిలీల్లో ఆ అపాయింట్‌మెంట్ తేదీ 2005గా చూపిస్తోంది. ఎస్జీటీగా పనిచేసిన సర్వీసుకు పాయింట్‌లు యాడ్ అవ్వడం లేదు. అలాగే టిస్ లో చేరిన తేదీని చూపినప్పటికీ ఆ సమాచారం బదిలీ దరఖాస్తులో తీసుకోవడం లేదు. ఇలాంటి సమస్యలు ఎన్నో ఉన్నాయి. వాటన్నింటిని అధికారులు తప్పనిసరిగా పరిష్కరించి న్యాయం చేయాలి.
– నరోత్తమరెడ్డి, స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చిత్తూరు

బదిలీ దరఖాస్తులకు సాంకేతిక సమస్యలు



ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న టీచర్లు

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల బదిలీలకు దరఖాస్తు చేసుకుంటున్న సర్వర్ శుక్రవారం ఉదయం నుంచి మొరాయిస్తూనే ఉంది. బదిలీలు చేసుకునేందుకు నెట్ సెంటర్ల వద్దకు వెళ్తున్న టీచర్లకు నిరీక్షణ తప్పడంలేదు. గంటల తరబడి సర్వర్ పనిచేయకుండా పోతుండడంతో టీచర్లు విస్తుపోతున్నారు. అదే విధంగా దరఖాస్తులు చేసుకునే సమయంలో చాలా మంది టీచర్లకు ఓటీపీలు అందడం లేదు. ఈ సమస్యను పరిష్కరించాలని విద్యాశాఖ అధికారులు విన్నవిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

కానరాని హెల్ప్‌డెస్క్

బదిలీల కసరత్తు సమయంలో టీచర్లకు అనేక సందేహాలను నివృత్తి చేసేందుకు డీఈవో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే ఎలాంటి హెల్ప్‌డెస్క్ ను ఏర్పాటు చేయకపోవడంతో క్షేత్రస్థాయిలో టీచర్లు అవస్థలు ఎదుర్కుంటున్నారు.



వాట్సాప్ గ్రూపులలో ట్రోల్ అవుతున్న సమస్యలు

దరఖాస్తు గడువు పొడిగించాలి



టీచర్ల బదిలీల దరఖాస్తు గడువు తేదీలను పొడిగించాలి. బదిలీలకు దరఖాస్తు చేసుకుంటుంటే సాంకేతిక సమస్యలు అధికంగా వస్తున్నాయి. టీచర్లు సకాలంలో దరఖాస్తులను ఆన్‌లైన్ చేసుకోలేక పోతున్నారు. ఓటీపీలు రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వివిధ సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఉన్నతాధికారులు బదిలీల గడువును పొడిగించాలి. – రెడ్డి శేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌టీఏ రాష్ట్ర ట్రెజరర్, చిత్తూరు జిల్లా

క్లుప్తంగా

జిల్లాకు వేరుశనగ సరఫరా

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాకు శుక్రవారం వేరుశనగ విత్తన కాయలొచ్చాయి. తొలి విడతగా కొన్ని మండలాలకు కాయలను అధికారులు సరఫరా చేశారు. మొత్తం 4108.2 క్వింటాళ్ల విత్తనం రాగా..కుప్పంకు 848.7 క్వింటాళ్లు, వి.కోటకు 424.5 క్వింటాళ్లు, బైరెడ్డిపల్లికి 294 క్వింటాళ్లు, శాంతిపురానికి 357 క్వింటాళ్లు, రామకుప్పంకు 666 క్వింటాళ్లు వచ్చాయి. అయితే ఈ కాయలకు ప్రభుత్వం పూర్తి ధర ప్రకటించింది. కానీ రాయితీ ధర ప్రకటించలేదు. దీంతో కాయల పంపిణీకి ముహూర్తం ఖరారు కాలేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

కాపునాడు ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షులుగా రాధ



తిరుపతి కల్చరల్ : కాపునాడు సేవా సమితి ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా విభాగం అధ్యక్షులుగా దామా రాధా నియమితులయ్యారు. శుక్రవారం ఈమేరకు సమితి జిల్లా అధ్యక్షుడు మధురాయల్ ఆధ్వర్యంలో పసుపులేటి హరిప్రసాద్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. హరిప్రసాద్ మట్లాడుతూ 200 మంది మహిళలతో కాపునాడు సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాపునాడు జిల్లా అధికార ప్రతినిధి తుపాకుల మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్ జ్ఞాన చంద్ర, పగడాల సునీల్ రాయల్ పాల్గొన్నారు.

గంగమ్మ విగ్రహం దొంగ అరెస్టు



స్వాధీనం చేసుకున్న విగ్రహంతో నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

పాలసముద్రం : మండలంలోని వెంగళరాజు కుప్పం గంగమ్మ గుడిలో చోరీకి గురైన అమ్మవారి ఉత్సవ విగ్రహం, ఆంపిప్లయిర్‌ను స్వాధీనం చేసుకుని శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ మహమ్మద్ అజీత్, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. వారు మాట్లాడుతూ.. మండలంలోని వెంగళరాజుకుప్పంలోని గంగమ్మగుడిలో ఈనెల 13వ తేదీ దొంగలు అమ్మవారి ఊరేగింపు విగ్రహం, ఆంపిప్లయిర్‌ను చోరీ చేశారు. దీనిపై పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి గాలిస్తుండగా రహస్య సమాచారం మేరకు బలిజకండ్రిగ–చిత్తూరు రోడ్డులో నిందితుడు హరీశ్‌ను అరెస్టు చేసి అతడి వద్ద నుంచి పంచలోహ ఉత్సవ విగ్రహం, ఆంపిప్లయిర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. చోరీలో పాల్గొన్న దినేష్, చిరంజీవి పరారీలో ఉన్నారని తెలిపారు.

23 రోజులు.. 1000 రిజిస్ట్రేషన్లు

- రేషన్‌కార్డుకు వివాహ రిజిస్ట్రేషన్ తిప్పలు
- అవసరం లేదని ప్రకటించిన అధికారులు
- అవగాహన లేక పెరుగుతున్న రద్దీ
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దోపిడీ



చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దీ

చిత్తూరు కార్పొరేషన్ : ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయి కొత్తగా రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునేవారు ఆధార్‌తో పాటు వివాహ ధ్రువపత్రం జత చేసి సచివాలయాల్లో అందజేయాలని తొలుత ప్రభుత్వం నిబంధన విధించింది. తర్వాత వీటిపై అభ్యంతరాలు రావడంతో ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. పెళ్లికార్డు ఉంటేనే వివాహ రిజిస్ట్రేషన్ పత్రం ఇస్తారు. దరఖాస్తుకు జత చేసేందుకు మళ్లీ శుభలేఖలను ప్రింటింగ్ చేయించుకుంటున్నారు. వివాహ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు ఫారానికి భార్యాభర్తల ఆధార్ కార్డు, శుభలేఖ, వివాహ సమయంలో తీసుకున్న ఫొటోలు, ముగ్గురు సాక్షులు, కల్యాణ మండపం రశీదు, ఆలయాల్లో జరిగితే వారు ఇచ్చే రిజిస్ట్రేషన్ పత్రం, రూ.500 చలానా జత చేసి సబ్ రిజిస్ట్రార్‌కు దరఖాస్తు ఇవ్వాలి. అన్నీ సవ్యంగా ఉంటే గంట వ్యవధిలో వివాహ ధ్రువీకరణ పత్రం ఇస్తారు. కానీ అన్నీ ఉన్నా ఏదో ఒక సాకుతో రిజెక్టు చేస్తున్నారు. అదే డాక్యుమెంట్ రైటర్ల ద్వారా వెళ్లి అడిగినంత ఇస్తే గంటలో పనిచేస్తున్నారనే వాదన ఉంది.

అన్నా ఇది సీజన్... ఎంత సేపు మీ (డాక్యుమెంట్ రైటర్లు) సంపాదననే మా గురించి పట్టించుకోండి.. లేదా ఇదేమన్నా అత్తారిళ్లా వచ్చి పనులు చేసుకోనిపోవడానికి అని ఇటీవల జిల్లాలోని ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ సహాయకులు అన్న మాటలు.. ఇవే వారి పనితీరుకు తార్కాణం.

వివాహ రిజిస్ట్రేషన్ వద్దని ప్రకటన

రేషన్‌కార్డుకు వివాహ రిజిస్ట్రేషన్ అవసరం లేదని పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. వీటిపై పెద్దగా క్షేత్రస్థాయిలో ప్రచారం లేకపోవడం, భవిష్యత్తులో పథకాలకు పనికి వస్తుందని రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని 8 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలో మొత్తం 478 వివాహ రిజిస్ట్రేషన్స్ జరిగాయి. కానీ మే నెలలో 23 రోజులకు 1005 రిజిస్ట్రేషన్స్ జరిగాయి. ఇందులో ఎక్కువగా చిత్తూరు అర్బన్, రూరల్ కార్యాలయాల నందు జరుగుతున్నాయి. తక్కువ వివాహ రిజిస్ట్రేషన్స్ జరిగే కార్వేటినగరం, బంగారుపాళ్యం, కుప్పం, నగరి, పుంగనూరు, పలమనేరులోనూ అందినకాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వసూళ్లు

జిల్లాలో 19 వేల మంది పైగా రేషన్ కార్డులో చిరునామా మార్పు, ఆధార్ సీడింగ్ కరెక్షన్, సభ్యుల చేర్పు, సభ్యుల తొలగింపు, కొత్తరేషన్ కార్డు, కార్డు విభజన కోసం , రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వివాహం జరిగిన వెంటనే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే వారు అన్ని వివరాలను పరిశీలించి అక్కడే ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్నారు. గడువు దాటిన వారు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచే పొందాల్సి ఉంటుంది. ఫొటోలు, ధ్రువీకరణ పత్రాల నకళ్లు, పురోహితుడి ధ్రువీకరణ, చలానా చెల్లింపు ఇలా మొత్తంగా రూ.1000 వరకు ఖర్చువుతోంది. అదనంగా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రైటర్లు రూ.3 వేలకు పైగా వసూలు చేస్తున్నారు.

ముస్లిం, క్రైస్తవులకు తిప్పలు

ముస్లిం, క్రైస్తవులు వివాహ ధ్రువీకరణ పత్రం పొందాలంటే కనీసం రెండు నెలల సమయం పడుతుంది. వివాహ పత్రానికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు నోటీసు బోర్డులో 30 రోజులు ఉంచుతారు. దీని పై అభ్యంతరాలు రాకుంటే అప్పుడు ధ్రువీకరణ పత్రం ఇస్తారు. కానీ కొత్త కార్డులకు దరఖాస్తు గడువు జూన్ 7 వరకు మాత్రమే ఉండటతో వీరిలో ఆందోళన వ్యక్తమవుతోంది.. కానీ సమయం పొడిగించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

అవసరాన్ని ఆసరాగా చేసుకొని..

నగరానికి చెందిన శోభన్, సుమిత్రలకు వివాహమై సంవత్సరం అయింది. రేషన్ కార్డుకు వివాహ రిజిస్ట్రేషన్ అవసరం లేదనే అంశంపై ప్రచారం లేకపోవడంతో వివాహ రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించారు. అది లేదు, ఇది సరిగ్గా లేదు, ఆ పత్రం కావాలి అంటూ సవాలక్ష ప్రశ్నలను అధికారుల వేశారు. దీంతో గత్యంతరం లేక డాక్యుమెంట్ రైటర్లను సంప్రదించగా రూ.5 వేలు డిమాండ్ చేశారు. అంతా ఎందుకంటే స్లాట్ బుకింగ్‌కే రూ.500, అధికారికి రూ.2000 వరకు, డాక్యుమెంట్ స్కానింగ్, నెట్, ఇతర ఖర్చులు అన్ని కలుపుకొని అంత అవుతుందన్నారు. అతడితో బేరం ఆడి రూ.4 వేలు ఇచ్చారు. వెంటనే రిజిస్ట్రేషన్ చేసి ధ్రువీకరణ పత్రం చేతిలో పెట్టారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు



వివాహ రిజిస్ట్రేషన్‌కు ఎటువంటి అదనపు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. రేషన్ కార్డుదారులకు వివాహ రిజిస్ట్రేషన్ అవసరం లేదని ప్రభుత్వం ప్రకటించింది. కానీ పలు అంశాలకు రిజిస్ట్రేషన్ ప్రయోజనకరమని చేసుకుంటున్నారు అది మంచిదే. వేలకు వేలు అడిగితే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయండి, చర్యలు తీసుకుంటాం.

– రమణమూర్తి, జిల్లా రిజిస్ట్రార్

పంచాయతీలపై భారం

- 25న సీఎం గృహ ప్రవేశం
- అధికార పార్టీ మెప్పు కోసం ఆరాటం



నాయనపల్లి వద్ద జాతీయ రహదారి పక్కన పంచాయతీ పనులు

శాంతిపురం : నిధులు లేక నీరసించిన పంచాయతీలపై జిల్లా ఉన్నతాధికారులు అదనపు భారం మోపారు. ఈనెల 25న మండలంలోని కడపల్లె పంచాయతీలో ముఖ్యమంత్రి చంద్రబాబు గృహ ప్రవేశం ఉండటంతో అధికార పార్టీ నాయకుల మెప్పు కోసం అధికారులు అపసోపాలు పడుతున్నారు. సీఎం రాకను పురస్కరించుకుని పంచాయతీల పరిధిలోని వాటితో పాటు ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల పక్కన శుభ్రం చేయాలని హుకుం జారీ చేశారు. దీని కోసం ఆయా శాఖల వద్ద నిధులు లేవని బాధ్యతలను పంచాయతీల నెత్తిన పెట్టారు. కుప్పం నియోజకవర్గంతో పాటు పొరుగున ఉన్న నియోజకవర్గాల లోనూ ఈ పనులు సాగుతున్నాయి. దీర్ఘకాలంగా నిధుల కొరతతో అల్లాడుతూ.. పెండింగ్ బిల్లులను క్లియర్ చేయడానికే అపసోపాలు పడుతున్న పంచాయతీలకు ఇది మరింత భారంగా మారింది. రాజకీయ కారణాలతో చాలా చోట్ల సర్పంచులు అంటీముట్టనట్లు ఉంటే పంచాయతీ కార్యదర్శులే భారం మోయాల్సి వస్తోంది. ఇప్పటికే నిర్వహణ పనుల కోసం అప్పులు చేసి పెట్టిన సొమ్మే ఇంకా రాకపోగా ఇప్పుడు కొత్తగా ఉపద్రవం వచ్చిందని వారు వాపోతున్నారు.

కేసు విత్‌డ్రా చేసుకోకపోతే.. నా కొడకా కొట్టి చంపేస్తా!

- నీ కొడుక్కి పెళ్లి కాకుండానే చంపేస్తా. కుటుంబం మొత్తాన్ని లేపేస్తా
- నాపై ఎస్సీ, ఎస్టీ కేసు ఎవడ్రా పెట్టింది?
- పూతలపట్టు ఆకనంబట్టు ఎస్సీ సర్పంచ్‌పై టీడీపీ నేత బూతుపురాణం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : న్యాయ స్థానంలో విచారణలో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసును ఉపసంహరించుకోలేదని ఓ ఎస్సీ సర్పంచ్‌పై టీడీపీ నేత నోటికొచ్చినట్లు దుర్భాషలాడాడు. ఫోన్లో బండబూతులు తిడుతూ బెదిరింపులకు తెగబడ్డాడు. కేసు వెనక్కి తీసుకోకపోతే కొట్టి చంపేస్తానంటూ భయభ్రాంతులకు గురిచేశాడు. ఆ ఫోన్‌కాల్ గురువారం బయటకు రావడంతో టీడీపీ నేత బూతుపురాణం వెలుగులోకి వచ్చింది. వివరాలివీ.. 2022 ఆగస్టు 4న పూతలపట్టు మండలం, వేపనపల్లి పంచాయతీలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ముగిసే సమయంలో టీడీపీ నేత హేమాద్రి తన అనుచరులతో వచ్చి వారిపై దాడిచేసి కులం పేరుతో దూషించారని అప్పట్లో పూతలపట్టు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ప్రస్తుతం ఈ కేసు న్యాయస్థానం విచారణలో ఉంది. ఈ నేపథ్యంలో.. గత ఏడాది టీడీపీ అధికారంలోకి రావడంతో ఈ కేసును విత్‌డ్రా చేయించేందుకు కేసులోని కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. కానీ, వారి ప్రయత్నాలు ఫలించలేదు. ఇది జీర్ణించుకోలేని మరో టీడీపీ నేత జయప్రకాష్ పూతలపట్టు మండలం, ఆకనంబట్టు ఎస్సీ సర్పంచ్ మణికి ఫోన్‌చేసి నోటికొచ్చినట్లు బూతులు తిడుతూ బెదిరింపులకు దిగాడు. 'నువ్వు కేసు వెనక్కి తీసుకోకపోతే నా కొడకా.. పూతలపట్టులో కనపడకుండా కొడతా'..అంటూ బెదిరించాడు. 'లం..కొడకా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డినే కొట్టాను.. నీకు దిక్కున్నచోట చెప్పుకో. ముందు రెడ్లను కొడతాను. ఏ రెడ్డి కూడా నిన్ను కాపాడలేడు'.. అంటూ రెచ్చిపోయాడు. అంతేకాదు.. 'నీ కొడుక్కి పెళ్లి కాకుండానే చంపేస్తా. కుటుంబం మొత్తాన్ని లేపేస్తా. నాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఎవడ్రా పెట్టింది'.. అంటూ దూషించాడు. 'టీడీపీ మండల అధ్యక్షుడు దొరబాబు కాళ్లు పట్టుకున్నాడు నీ కొడుకు.. అందుకే ఆ రోజు చంపకుండా వదిలేశా'నంటూ పరుషంగా మాట్లాడాడు.'ఇప్పుడు అధికారం మాది. ఎన్ని ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతారో పెట్టండి చూద్దాం.. మాల నా కొడకల్లారా'.. అంటూ సవాల్ విసిరాడు. మా పార్టీకి, సీఎంకే భయపడను'.. అంటూ మణిపై ఫోన్లో జయప్రకాష్ ఇరవై నిమిషాల పాటు బూతులతో రెచ్చిపోయాడు. మరోవైపు.. టీడీపీ నేత కాల్ వైరల్ కావడంతో నియోజకవర్గంలోని దళితులంతా ఆయన్ను దుమ్మెత్తిపోస్తున్నారు.

క్వారీపై కన్ను



హిటాచీని అడ్డుకున్న రెండు పంచాయతీ ప్రజలు

- అడ్డుకున్న గ్రామస్తులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఐరాల మండలంలోని మతంపల్లెలో వెలసిన శ్రీ వీరభద్ర స్వామి ఆలయానికి అనుసంధానమైన దేవుని నల్లగుట్టలోని క్వారీపై పచ్చనేతల కన్ను పడింది. నల్లగుట్ట కింద సొరంగంలో దేవుడి రాతి విగ్రహాలు ఉన్నాయి. ఏటా కార్తీక మాసంలో పూజలు నిర్వహిస్తారు. దీంతో పాటు పొడి స్తంభంపై కార్తీక మాసంలో అఖండ జ్యోతిని ఆనవాయితీగా వెలిగిస్తున్నారు. పురాతన ఆలయం కావడంతో ప్రత్యేక విశిష్టత ఉంది. ఈ క్రమంలో పచ్చ నేతలు ఈ దేవుని నల్లగుట్టపై క్వారీ చేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీంతో శుక్రవారం ఉదయం లారీలో హిటాచీని తీసుకుని మాదిగపల్లె మార్గం గుండా రిజ్వర్ ఫారెస్ట్‌లోకి వెళుతుండగా స్థానికులు గమనించి స్థానిక సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీపీ మోహన్‌కు సమాచారం ఇచ్చారు. వారు ఆలయానికి సంబంధించిన నిర్వాహకులు, రెండు పంచాయతీల గ్రామ ప్రజలకు సమాచారం అందించారు. వారందరూ దేవుని నల్లగుట్ట వద్దకు చేరుకొని హిటాచీ డ్రైవర్‌ను నిలదీశారు. దీంతో డ్రైవర్ మా ఓనర్ పంపితేనే ఇక్కడికి వచ్చానని సమాధానం ఇచ్చాడు. దీంతో సర్పంచ్, ఎంపీపీ హిటాచీ యజమానికి ఫోన్ చేసి ప్రశ్నించగా ఎమ్మెల్యే, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు, పాతపాళ్యం సర్పంచ్ లోకేష్ చెప్పితేనే హిటాచి పంపించామని బదులిచ్చారు. దీంతో వారు స్పందిస్తూ పురాతన ఆలయానికి సంబంధించిన ఈ గుట్టపై ఎవరైనా క్వారీ పనులు చేపడితే తీవ్ర పరిణామాలు చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. దీంతో డ్రైవర్ హిటాచీని గుట్ట కింద వదిలి వెళ్లిపోయాడు. ఈ విషయంపై శనివారం తహసీల్దార్, ఎస్ఐకు వినతి పత్రాలు అందజేస్తామన్నారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. దీనిపై తహసీల్దార్ మహేష్‌కుమార్‌ను వివరణ కోరగా వీఆర్ఓను నల్లగుట్ట వద్దకు పంపించామన్నారు.



దేవుని నల్లగుట్ట

రిజ్వర్ ఫారెస్ట్‌లోకి అనుమతి తప్పనిసరి

అటవీశాఖకు సంబంధించిన రిజ్వర్ ఫారెస్ట్‌లోకి ఎలాంటి వాహనాలకైనా అనుమతులు తప్పనిసరిని స్థానిక అటవీశాఖ అధికారి రాకేష్‌కుమార్ తెలిపారు. అనుమతి లేకుండా ప్రవేశిస్తే వాహనాలను సీజ్ చేసి చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుకు దరఖాస్తులు



శిక్షణల నివేదికలను స్వీకరిస్తున్న జిల్లా పర్యాటక శాఖ అధికారిణి గౌరి

చిత్తూరు కలెక్టరేట్ : పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పర్యాటక శాఖ అధికారిణి గౌరి తెలిపారు. కలెక్టరేట్‌లోని పర్యాటక శాఖ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్ మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషియన్‌లో 2025–26కు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. తిరుపతి జిల్లా కేంద్రంలోని భారత పర్యాటక శాఖ, ఏపీ పర్యాటక శాఖలు సంయుక్తంగా ఈ కోర్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అభ్యర్థులు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హత ఆసక్తి ఉన్నట్లైతే 97013 43846, 97004 40604, 95021 13163 నంబర్లలో సంప్రదించాలన్నారు. కోర్సులు పూర్తి చేసే అభ్యర్థులకు ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ఉద్యోగ అవకాశాలు, బ్యాంక్ రుణ సదుపాయం, బాల బాలికలకు వేరువేరుగా హాస్టల్ సదుపాయం కల్పిస్తారని చెప్పారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కోర్సుల వివరాలు

1. బీయస్సీ, హెచ్, హెచ్.ఎ 3 సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్ 40% మార్కుల పైగా సాధించిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ కోర్సులో ఎఫ్ అండ్ బి ప్రొడక్షన్, ఎఫ్ అండ్ బి సర్వీస్, కరెంట్ ఆఫీస్, హౌస్ కీపింగ్ నేర్పించి 4 నెలలు ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్లో ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారన్నారు.

2. క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ (సీసీఎఫ్‌పీపీ) కోర్సుకు పదో తరగతి పాసైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కోర్సులో ఏడాది పాటు దేశ విదేశాల వంటకాలను నేర్పించి 6 నెలలు ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్లో ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారని తెలిపారు.

3. సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఫుడ్ – బేవరేజ్ సర్వీస్ (సీసీఎఫ్‌బీఎస్) కోర్సుకు పదో తరగతి పాసైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఈ కోర్సులో ఐదు నెలల పాటు రెస్టారెంట్, బార్ సర్వీస్ నేర్పించి 1 నెల ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్లో ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారని చెప్పారు.

తమ్ముళ్ల దౌర్జన్యం

- వైఎస్సార్‌సీపీ నేతలపై పచ్చనేతల ఆగడాలు
- అధికార మదంతో పేట్రేగుతున్న తమ్ముళ్లు
- పూతలపట్టులో రెచ్చిపోతున్న కూటమి శ్రేణులు





టీడీపీ మూకల దాడిలో గాయపడ్డ వైఎస్సార్‌సీపీ మైనారిటీ అభిమానులు (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పూతలపట్టు నియోజకవర్గంలో పాతకక్షలకు కూటమి నేతలు పదును పెట్టారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ వ్యతిరేకతను ప్రశ్నించే వారిని లక్ష్యంగా చేసుకుని అధికార మదంతో పచ్చరౌడీలు పెట్రేగిపోతున్నారు. ఆందోళనలు సృష్టించి భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఈ వింత పోకడను ప్రశ్నిస్తున్న అమాయకులైన దళితులు, మైనారిటీలపై దాడులకు తెగబడుతున్నారు. ఎదిరించిన వారిపై అక్రమ కేసులు బనాయించి చిత్రహింసలకు గురిచేస్తున్నారు.

రౌడీ రాజకీయమా?

ప్రశ్నించే గొంతును కూకటివేళ్లతో పెకలించాలనే దృఢ సంకల్పంతో పక్కా ప్రణాళికలతో గొడవలు సృష్టించి పచ్చని పల్లెల్లో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు నాణ్యమైన విద్యను అందించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలనే సంకల్పంతో జననేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టారు. తద్వారా పేదవారి కన్నీళ్లు తుడుస్తూ తల్లిదండ్రులకు భారం కారాదని తల్లుల ఖాతాలకు డబ్బులు వేసేవారు. కానీ నేటి ప్రభుత్వంలో అమ్మఒడి అందక విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల, కళాశాల యాజమాన్యాల ఫీజుల చెల్లించక ఇబ్బందుల పడుతున్నారు. దీనిపై ప్రభుత్వాన్ని ఏకిపారేసిన ఓ ప్రైవేటు లెక్చరర్‌పై అక్రమ కేసులు బనాయించి చిత్రహింసలకు గురిచేశారు.

సామాన్యులపై కూటమి ప్రతాపం

- ఓ నిరుపేద మైనార్టీ బాలుడు తన కుటుంబం పడుతున్న కష్టాలను చూడలేక .. జగనన్న ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే తమ కుటుంబం ఇలా కష్టాలు పడేవా అని మదనపడ్డాడు. స్థానికంగా కూటమి నేతలు చేస్తున్న అరాచకాలను భరించలేక 2029 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించి అధికార సింహాసనాన్ని అధిరోహిస్తుందని..తన అభిమానాన్ని వాట్సాప్‌లో స్టేటస్‌గా పెట్టుకున్నాడు. ఇది భరించలేని పచ్చ నేతలు కాపుగాసి రాత్రి సమయంలో అదును చూసి ఆ బాలుడిని అపహరించి చిత్రహింసలకు గురిచేసి దాడి చేశారు. దీనిని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ అభిమానుల ఐదుగురిపై విచక్షణా రహితంగా కత్తులు, రాడ్లు, కరల్రతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.ఈ ఘటనలో ఓ యువకుడికి కంటిలో రెటీనా దెబ్బతిని చూపు కోల్పోయే ప్రమాదంలో పడ్డాడు.
- ఎస్సీ, ఎస్టీ కేసు విత్‌డ్రా తీసుకోలేదని పూతలపట్టు మండలం ఆకనబట్టు సర్పంచ్ మణిపై టీడీపీ నేత జయప్రకాష్ బూతులతో బెదిరించాడు. ఇంతకీ కేసు వెనక్కి తీసుకుంటావా లేదా అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడారు. మాట మాటకు ఫోన్లో కులం పేరుతో దూషిస్తూ.. భయభ్రాంతులకు గురి చేశాడు. కేసు వెనక్కి తీసుకోకపోతే కుటుంబ సమేతంగా చంపేస్తానంటూ బూతులతో హెచ్చరికలు జారీ చేశాడు. ఇవీ కొన్ని మాత్రమే బయటకు కనిపించిన చాలా వరకు వెలుగులోకి రానివి చాలా ఉన్నాయి. ఇటువంటి దారుణ ఘటనలు కోకొల్లలు. సంఘ విద్రోహ చర్యలకు పాల్పడి చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్న కూటమి గూండాలను కూకటివేళ్లతో పెకలించి శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించి పక్షపాతాన్ని చూపడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది.

దాడులపై న్యాయపోరాటానికి దిగుతాం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రక్షణ కరువైంది. ఎక్కడ చూసినా దాడులు, అరాచకాలు జరుగుతున్నాయి. కనీసం సామాన్య జనానికి సరైన న్యాయం జరగడం లేదు. పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని కూటమి నేతలు దాడులు చేయిస్తున్నారు. తప్పుడు కేసులు పెట్టిస్తున్నారు. అన్నిరకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ రోజు అధికారం చేతిలో ఉందని ఇలా చేయడం ఎంత వరకు సమంజసం. ఇది మంచి పద్ధతి కాదు. అలాగే ఒక ఎస్సీ సర్పంచ్‌ను కులం పేరుతో దూషించడంతో పాటు బూతులు తిట్టడం కరెక్టు కాదు. దీని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. నియోజకవర్గంలో జరుగుతున్న దాడులు, అరాచకాలపై న్యాయపోరాటానికి దిగుతాం. – సునీల్‌కుమార్, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే

ప్రాణం తీసిన ఈత సరదా

- ఇద్దరి పరిస్థితి విషమం

శ్రీరంగరాజపురం : ఈతకు వెళ్లి బాలిక మృతి చెందిన సంఘటన మండలంలోని 50 బసివిరెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా పొన్నైకు చెందిన లావణ్య (12) వేసవి సెలవుల్లో భాగంగా తమ బంధువులు 50 బసివిరెడ్డిపల్లి కాలనీలోని హరి, లత ఇంటికి వచ్చింది. ఈ సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం హరి భార్య లత తమ పిల్లలు కార్తీక్ (12), పల్లవి (09)తోపాటు తమ అన్న కూతురు లావణ్య (12)తో పాటు కలిసి గ్రామం సమీపంలో ఉన్న ముక్కల చెరువులో ఈత, చేపల వేట కోసం వెళ్లారు. ఈ క్రమంలో లత చేపలు పడుతుండగా ముగ్గురు పిల్లలు సరదాగా చెరువులో ఈత నేర్చుకుంటుండగా ప్రమాదవశాత్తు లావణ్య, పల్లవి, కార్తీక్ కాలుజారి చెరువులో మునిగిపోయారు. గమనించిన లత చెరువులో మునిగిపోతున్న ముగ్గురిని కాపాడే ప్రయత్నం చేశారు. అప్పటికే లావణ్య మృతి చెందింది. కార్తీక్, పల్లవిని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నారు.

అంజన్న అభయం

తవణంపల్లె : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి సందర్భంగా శుక్రవారం వసంతోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి అర్చకులు సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తి ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, శాస్త్రోక్తంగా పూజలు చేసి దూప దీప నైవేద్యం సమర్పించారు. ఉత్సవమూర్తిని పల్లకిలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం చేశారు. భక్తులు స్వామికి వసంతాలు కలిపి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ హనుమంతురావు, సిబ్బంది పాల్గొన్నారు.

గరుడవాహనంపై వేణుగోపాలుడు



గరుడ వాహనంపై వేణుగోపాలస్వామి

కార్వేటినగరం : కార్వేటినగరంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజు శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై విహరిస్తూ స్వామివారు భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7 గంటలకు విశేషాలంకృతుడైన వేణుగోపాలుడు గరుడ వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరించారు. డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశేఖర్, ఆలయ అధికారి తదితరులు పాల్గొన్నారు.